# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-10-2023** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మొలాసెస్‌పై జీఎస్టీని 28శాతం నుంచి 5శాతానికి తగ్గించినట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.**
2. **కృష్ణానదీ జలాల పంపిణీ విషయంలో బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన విధివిధానాలే తుది నిర్ణయమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేసారు.**
3. **తెలంగాణలో దసరా సెలవును అక్టోబర్ 23కు మారుస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.**
4. **చైనాలోని హాంగ్‌జా నగరంలో జరుగుతున్న ఆసియా క్రీడోత్సవాల్లో మన దేశం మొదటిసారి 107 పతకాలు సాధించింది.**
5. **ఆసియా క్రీడల్లో శతపతకాలు సాధించిన భారత క్రీడాకారులను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు.**

==========================

మొలాసెస్‌పై వస్తుసేవల పన్నును 28శాతం నుంచి 5శాతానికి తగ్గిస్తున్నామని, ఈ నిర్ణయం వల్ల చెరకు రైతులకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. చిరుధాన్యాల పిండిని ప్యాకేజ్డ్ రూపంలో లేబుల్ చేసి విక్రయిస్తే 5శాతం జీఎస్టీ ఉంటుందని, నేరుగా విక్రయిస్తే జీఎస్టీ ఉండదనీ చెప్పారు. నిన్న ఢిల్లీలో జరిగిన 52వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి వెల్లడించారు. జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ అధ్యక్ష పదవికి గరిష్ట వయోపరిమితిని 67ఏళ్ళ నుంచి 70 ఏళ్ళకు పెంచారు... అలాగే ట్రిబ్యునల్ సభ్యుల గరిష్ట వయోపరిమితిని 65ఏళ్ళ నుంచి 67ఏళ్ళకు పెంచారు. కనిష్ట వయోపరిమితిని 50 ఏళ్ళుగా నిర్ణయించారు.

-------------------------

కృష్ణానదీ జలాల పంపిణీ విషయంలో బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన విధివిధానాలే తుది నిర్ణయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. 1976లో బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ప్రకారమే కృష్ణా జలాలను రాష్ట్రాలు పంచుకుంటున్నాయని గుర్తు చేసారు. బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు వల్ల ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరుగుతుందని, దాన్ని నిలువరించేందుకే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసామనీ మంత్రి చెప్పారు. ఇప్పుడు ఆ ట్రిబ్యునల్‌ను కేంద్రం పొడిగించడం సరైన నిర్ణయం కాదని, అదే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి.. ప్రధానమంత్రికి లేఖ ద్వారా తెలియజేసారని వివరించారు. బచావత్

ట్రిబ్యునల్ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 511 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించారని మంత్రి వెల్లడించారు. ఆ మేరకు రాష్ట్రానికి ఇచ్చిన ప్రతీ నీటిబొట్టునీ ఒడిసి పట్టుకుంటామని మంత్రి చెప్పారు. కృష్ణాజలాల కోసం న్యాయపోరాటం చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదం పట్ల ఏమాత్రం సహనం ఉండకూడదని, ఉగ్రవాదులపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలనీ ఆయన చెప్పారు. డెహ్రాడూన్‌లో నిన్న జరిగిన 49వ అఖిల భారత పోలీస్ సైన్స్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఆయన ప్రశంసించారు. దేశ ప్రగతికి శాంతిభద్రతలు, అంతర్గత భద్రత, సరిహద్దుల భద్రత బలోపేతంగా ఉండాలన్నారు. గత తొమ్మిదేళ్ళలో జమ్మూకశ్మీర్, ఈశాన్యభారతం, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితి గణనీయంగా మెరుగుపడిందన్నారు. ఫలితంగా ఆ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమైందన్నారు.

---------------------------

వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకువెళ్ళే గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో కీలక ప్రకటన చేసింది. త్వరలోనే మానవ రహిత విమాన ప్రయోగాలు చేయడానికి సిద్ధపడుతున్నట్టు ప్రకటించింది. క్రూ ఎస్కేప్ సిస్టమ్ సామర్థ్యాన్ని కూడా పరీక్షించనున్నట్లు ఇస్రో వెల్లడించింది. రోదసిలోకి మానవులను తీసుకువెళ్ళి వారిని మళ్ళీ భూమి మీదకు తీసుకొచ్చే సామర్థ్యాన్ని సాధించడమే గగన్‌యాన్ ప్రయోగాల లక్ష్యం. టెస్ట్ వెహికిల్ ఆర్బిట్ మిషన్‌లో భాగంగా... ఒక క్రూ మాడ్యూల్‌ని రోదసిలోకి పంపిస్తారు. అది తిరిగి వెనక్కి వచ్చి బంగాళాఖాతంలో దిగుతుంది. సముద్రంలోనుంచి మాడ్యూల్‌ని తీసుకొచ్చే బాధ్యతను భారత నౌకాదళం తీసుకుంటుంది. ఆ మేరకు వారు ఇప్పటికే మాక్ ఆపరేషన్స్ ప్రారంభించారు. ఈ టెస్ట్ వెహికిల్ ఆర్బిట్ మిషన్ విజయవంతం అయ్యాక, మొదటి దశ గగన్‌యాన్ ప్రయోగంగా మానవ రహిత అంతరిక్ష ప్రయాణం ప్రారంభమవుతుంది.

---------------------------

దసరా సెలవు తేదీలో మార్పులు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దసరా సెలవును అక్టోబర్ 23కు మారుస్తూ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 24వ తేదీని కూడా సెలవుదినంగా ప్రకటించింది. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ యేడాది మొదట్లో విడుదల చేసిన సంవత్సర సెలవుల జాబితాలో అక్టోబర్ 24ను దసరా సెలవుగా ప్రకటించింది. తాజాగా ఆ సెలవును ఒకరోజు ముందుకు మార్చింది. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

---------------------------

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ తెలుగుదేశం శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా 'కాంతితో క్రాంతి' కార్యక్రమం నిర్వహించాయి. నిన్న రాత్రి 7 గంటల నుంచి 5 నిమిషాల పాటు విద్యుద్దీపాలు ఆర్పి ప్రమిదలు, కొవ్వొత్తులు, కాగడాలు వెలిగించారు. మొబైల్ ఫోన్లలోని టార్చిలైట్లు వెలిగించారు, వాహనాల దీపాలు ఆర్పుతూ వెలిగిస్తూ సంఘీభావం ప్రకటించారు. చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి రాజమహేంద్రవరంలోనూ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఢిల్లీలోనూ కాంతితో క్రాంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

---------------------------

చైనాలోని హాంగ్‌జౌ నగరంలో జరుగుతున్న ఆసియా క్రీడోత్సవాల్లో మన దేశం మొదటసారి 107 పతకాలు ప్రారంభించింది. 28 బంగారు పతకాలు, 38 వెండి పతకాలు, 41 కాంస్య పతకాలతో పతకాల పట్టికలో భారతదేశం నాలుగో స్థానంలో నిలిచింది. నిన్న ఒక్కరోజే భారత క్రీడాకారులు 6 స్వర్ణ పతకాలు, 4 రజత పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించారు. విజయవాడకు చెందిన తెలుగమ్మాయి వెన్నం జ్యోతిసురేఖ ఆర్చరీలో చరిత్రాత్మక స్వర్ణపతకం గెలుచుకుంది. అదే ఈవెంట్‌లో అదితి గోపీచంద్ స్వామి కాంస్యపతకం సాధించింది. ఆర్చరీ పురుషుల ఈవెంట్‌లో ఓజస్ దేవ్‌తలే స్వర్ణం, అభిషేక్ వర్మ రజతం సాధించారు. బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి స్వర్ణం సాధించారు. ఆసియన్ గేమ్స్‌లో బ్యాడ్మింటన్ విభాగంలో భారత్ గెలవడం ఇదే మొదటిసారి. కబడ్డీ, క్రికెట్ పోటీల్లో కూడా భారత జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. కాగా.. ఈ క్రీడోత్సవాలు ఈరోజుతో ముగుస్తాయి.

---------------------------

ఆసియన్ గేమ్స్‌లో మొట్టమొదటిసారి శతాధిక పతకాలు సాధించిన భారత క్రీడాకారుల బృందంపై ప్రశంసల జల్లు కురిసింది. దేశవ్యాప్తంగా క్రీడాభిమానులంతా సంబరాలు చేసుకుంటున్నారు. భారత క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభతో, చక్కటి పోరాట పటిమను ప్రదర్శించారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. భారత క్రీడాచరిత్రలో తొలిసారి 107 పతకాలు సాధించి, కొత్త స్థాయిని నిర్దేశించిన ఆటగాళ్ళు దేశానికి గర్వకారణంగా నిలిచారని రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేసారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ క్రీడావిజయం పట్ల హర్షం వ్యక్తం చేసారు. ఆటగాళ్ళ పట్టుదల, బృందస్ఫూర్తి దేశానికి ఘనకీర్తి తెచ్చిపెట్టాయని ప్రశంసించారు. అక్టోబర్ 10వ తేదీన ఆసియన్ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారుల బృందానికి ఆతిథ్యం ఇస్తానని ప్రధానమంత్రి ప్రకటించారు.

---------------------------

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ డీజీపీ అంజనీకుమార్ పిలుపునిచ్చారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో సైబర్ నేరాల నివారణ, పరిశోధనలు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశంలోనే మొదటి 'లా ఎన్‌ఫోర్స్ మెంట్ సిసో కౌన్సిల్'ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ నేరాల కేసులను దర్యాప్తు చేసి బాధితులకు 2 కోట్లకుపైగా డబ్బులు తిరిగి చెల్లించి, సైబరాబాద్ కమిషనరేట్ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. త్వరలోనే ఇండో డచ్ సైబర్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

---------------------------

ప్రపంచకప్‌ను దక్షిణ ఆఫ్రికా ఘనంగా ఆరంభించింది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 102 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసింది. క్వింటన్ డికాక్, వాన్ డెర్ డస్సెన్, ఐడెన్ మార్క్రమ్ సెంచరీలతో, మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 428 పరుగుల భారీ స్కోరు సాధించింది. ప్రపంచకప్ చరిత్రలో ఇదే అత్యధిక స్కోరు. ఈ భారీ లక్ష్యఛేదనలో శ్రీలంక 44.5 ఓవర్లకు 326 పరుగులు చేసి ఆలౌటైంది.

---------------------------

క్రికెట్ ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్ మీద బంగ్లాదేశ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్, 37.2 ఓవర్లలో 156 పరుగులకే ఆలౌట్

అయింది. ఆ చిన్న లక్ష్యాన్ని బంగ్లాదేశ్ కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి పూర్తి చేసింది. బంగ్లాదేశ్ 34.4 ఓవర్లలోనే 158 పరుగులు చేసి విజయం సాధించింది.

---------------------------

అక్టోబర్ 21న మోటార్ ప్రమాద కేసులు, పెండింగ్ రెవెన్యూ కేసుల రాజీ కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా చెప్పారు. శ్రీతీశ్రీష్ట్రశ్రీ ఇన్సూరెన్స్ అధికారులు, ఏపీఎస్ఆర్టీసీ అధికారులు, పిటిషనర్ల అడ్వకేట్లు, ఇతర రెవెన్యూ అధికారులతో ప్రధాన న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వలన కాలం, డబ్బు ఆదా అవుతాయని వివరించారు.

=======================